క్లుప్తంగా

నేడు ఉండిలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉండి: గ్రామంలోని మూడో సచివాలయ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 148వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు గుండబత్తుల సుబ్బారావు ఇంటివద్ద బస్టాండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

శాకంబరిగా దుర్గమ్మ

నరసాపురం రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. లయ అర్చకుడు మంచిలి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్‌లు సీతామహాలక్ష్మి, నాగదేవి, వీఆర్ఓలు లక్ష్మీనారాయణ, చిరంజీవి, ఆచంట జయరాం, కార్యాలయ సిబ్బంది సిబ్బంది, కుమారి, వీఆర్ఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. ఆషాఢ మాసం, అమ్మవారి జాతర మహోత్సవాలు ఇటీవల అత్యంత వైభవంగా నిర్వహించారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి బారులు తీరారు. అమ్మవారి దర్శనం అనంతరం పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా మావుళ్లమ్మఫ్రెండ్స్ యూనియన్ ఏర్పాట్లు చేశారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం వినతు అందించవచ్చని పేర్కొన్నారు.

విస్తృతంగా జగనన్న సురక్ష సర్వే

తణుకు టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామాలో విస్తృతంగా సర్వే చేస్తున్నారు. ఆదివారం తణుకు మండలం కోనాల, ముద్దాపురం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పథకాలకు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కోనాల గ్రామంలో 738 కుటుంబాలకు 453 గృహాలను సందర్శించి వివిధ ధ్రువీకరణ పత్రాల నిమిత్తం 110 టోకెన్‌లను జారీచేసి 65 సేవలు అందించినట్టు ఎంపీడీఓ పీ శ్రీనివాసరావు తెలిపారు. కొమరవరంలో మొత్తం 1914 గృహాలకు 1,114 గృహాలను సందర్శించి, 81 టోకెన్లను జారీ చేసి 67 సేవలు అందించినట్టు చెప్పారు.

నేడు డ్రగ్ ఫ్రీపై ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తాడేపల్లిగూడెం వారిచే సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఇంటర్నేషనల్ డ్రగ్ డేని పురస్కరించుకొని డ్రగ్ ఫ్రీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారం, ప్రతిజ్ఞలు చేస్తారని, వాసవి ఇంజినీరింగ్ కళాశాల, జీఎంఆర్ కళాశాలలో డ్రగ్ వల్ల వచ్చే దుష్ఫలితాలపై విద్యార్థుల మధ్య వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

ఐకమత్యంతో ఆర్యవైశ్యులు

తాడేపలిగూడెం అర్బన్ : పట్టణంలోని ఆర్యవైశ్యులు ఐకమత్యంతో ఒకే బాటపై నడుస్తున్నామని ఆర్యవైశ్య సంఘం సభ్యులు గమిని సుబ్బారావు తెలిపారు. ఆదివారం గమిని ఫంక్షన్ ప్లాజాలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గమిని మాట్లాడుతూ తాను ఇటీవల కాలంలో ఆర్యవైశ్య సంఘం కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్టు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు తోపాటు సంఘం బైలా సూచనల మేరకు తాను తిరిగి ఆర్యవైశ్య సంఘంలో కొనసాగనున్నట్టు చెప్పారు.

త్వరలో మరో పార్టీలోకి చేరిక

తాను బీజేపీ నాయకుడిగా పట్టణంలో కొనసాగుతున్నట్టు గమిని సుబ్బారావు చెప్పారు. భవిష్యత్తులో బీజేపీకి రాజీనామా లేఖను అందిస్తామన్నారు. అనంతరం మరో రాజకీయ పార్టీలోకి చేరనున్నట్టు వెల్లడించారు. ఆవివరాలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా ఎనిమిది మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్యశాల ద్వారా నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్ రోగుల ఇళ్ల వద్ద వైద్య సేవలను అందించారు.

విత్తనాలు సిద్ధం.. సాగుకు సన్నద్ధం

- తొలకరి ఖరీఫ్ పనులు ప్రారంభిస్తున్న రైతులు
- విత్తన శుద్ధిపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయాధికారులు



దిరుసుమర్రులో వరి పొలాలను దుక్కులు దున్నుతున్న దృశ్యం



యనమదుర్రులో నారుమడులు వేసిన దృశ్యం

భీమవరం అర్బన్ : తొలకరి వానలు మొదలయ్యాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ముందస్తు ఖరీఫ్ సాగు కోసం ఈ నెల 1న పంట కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ప్రధాన కాలువలు నుంచి పిల్ల కాలువలకు నీరు విడుదలవడంతో చేలల్లో నీటిని నింపి రైతులు ట్రాక్టర్లతో దమ్ములు చేస్తున్నారు. భీమవరం మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, తాడేరు, బేతపూడి, చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం తదితర గ్రామాలలో సుమారు 9 వేల ఎకరాలలో ఖరీఫ్ సాగుకు రైతులు శ్రీకారం చుడుతున్నారు. ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసి రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా అందుబాటులో ఉంచింది. దీంతో అన్నదాతలు సాగుకు సన్నద్ధమై నారుమడుల పనులు చేసుకుంటున్నారు. జులై మొదటి, రెండో వారం నుంచి వరినాట్లు వేయనున్నారు.

నారుమడి తయారీ

నారుమడి తయారు చేసుకోవడానికి వినియోగించే భూమిలో చివరి దుక్కులో ఐదు సెంట్ల భూమికి రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, కిలో పొటాషియం చల్లాలి. ఆకుమడిలో ముంపు నీరు దిగేందుకు చిన్న చిన్న బోదెలు ఆకుమడి చుట్టూ ఏర్పాటు చేసుకోవాలి. నారుమడిలో విత్తనాలు చల్లుకున్న తర్వాత మొదటి ఆకు విచ్చుకునే వరకు 10 రోజులపాటు ఆరుతడి యాజమాన్యం నిర్వహించాలి. 11వ రోజు తర్వాత మొదటి ఆకు విచ్చుకున్నాక నారుమడిలో నీరు ఉండేటట్లు చూసుకోవాలి. ఇలా నారుమడి వేసిన 21–25 రోజుల్లో నాణ్యమైన నారు తయారవుతుంది.

విత్తన శుద్ధితో నాణ్యమైన నారు

విత్తనం కొన్న వెంటనే 100 గింజలను మొలక పరీక్ష చేసి 80 శాతం మొలక వచ్చిన విత్తనాలనే వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే విత్తన శుద్ధితో నాణ్యమైన నారు లభిస్తుంది. పొడి శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు మూడు గ్రాముల చొప్పున కార్బన్‌డిజం మందు విత్తనాల సంచిలో వేసి మూతి బిగించి బాగా కలిపి 24 గంటలు నిల్వ ఉంచాలి. ఆ తర్వాత వాటిని నానెట్టి నారుమడిలో చల్లుకోవాలి. తడి విత్తన శుద్ధి విధానంలో కిలో విత్తనాలకు ఒక గ్రాము కార్బన్‌డిజం, ఒక లీటర్ నీటిలో కలిపి 24 గంటలు నానబెట్టి మరో 24 గంటలు మండి కట్టి వాటిని నారుమడిలో చుల్లుకోవాలి.

ఎకరా నారుమడికి 20 నుంచి 30 కేజీలు

ఒక ఎకరాకు చాలినంత నారు కావాలంటే 20 నుంచి 30 కేజీల వరి విత్తనాలు అవసరమవుతాయి. సాధారణంగా ఖరీఫ్ సాగుకు ఎమ్‌టీయూ 1061, ఎమ్‌టీయూ 1064, ఎమ్‌టీయూ 1318, సంపద స్వర్ణ రకాలు అనుకూలమని వ్యవసాయధికారులు చెబుతున్నారు.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు



ఈ ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అందుబాటులో ఉన్నాయి. విత్తన శుద్ధి తరువాతే నారుమడులు వేయాలి. నారుమడి తయారు చేసేటప్పుడు విత్తనాల సంచిని ట్యాగ్‌ను, రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలి.

– నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

రేపు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్) : పిల్లల గుండె వ్యాధులకు సంబంధించి ఈనెల 27వ తేదీన మెంటేవారి తోటలోని, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్‌వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీశీలన చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 ఏళ్లలోపు వయసు గల చిన్నారులకు వైద్య శిబిరంలో ఉచిత పరీక్షలు, శస్త్ర చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని భీమవరం, పరిసర ప్రాంతాల వారు వినియోగించుకోవలసిందిగా కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ఆకివీడు: మండలంలోని అయి భీమవరంలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.7,370 లని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి విలేకరులకు తెలిపారు.

సొంతింటి కల నెరవేర్చుకున్న లబ్ధిదారులు

పాలకొల్లు సెంట్రల్: దేశంలో ఇల్లు లేని పేదవాళ్లకు సొంతింటికల నెరవేర్చాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన పీఎంఏవై పథకం ప్రారంభించి ఎనిమిదేళ్లు పూర్తయ్యిందని పట్టణ ప్రణాళికా విభాగం అధికారి వీరబ్రహ్మం అన్నారు. ఆదివారం స్థానిక టిడ్కో గృహాల లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వీర బ్రహ్మం మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస యోజన పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా లబ్ధిదారులకు గృహాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా పట్టణంలో 6144 మందికి టిడ్కో గృహాలు మంజూరు చేశామన్నారు. సుమారు 1850 మందికి గృహాలు అందజేశామని త్వరలో మిగిలిన లబ్ధిదారులకు గృహాలు అప్పగించి వారి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ త్రినాథరావు, సీఎంఎం ఎస్.రత్నాకర్, సీఎల్‌టీసీ వీరభద్రం, సీఓలు సునేత్ర పాల్గొన్నారు.

నేడు ఎంఆర్‌పీఎస్ ఎంఎస్పీ యువత సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాదిగ పోరాట సమితి ఎంఎస్పీ అనుబంధ సంఘాల తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికయిన ఇంటర్, డిగ్రీ, పీజీ యువత నియోజకవర్గ సమీక్షా సమావేశం స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్టు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వి.సిద్ధు మాదిగ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు, అనుబంధ సంఘాల సీనియర్ నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా జూలై 7న ఎంఆర్‌పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో నిర్వహించాలని పేర్కొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిశ ప్రాంతాల నుండి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈవో డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓల్డ్ వయ్యేరును కమ్మేసిన గుర్రపుడెక్క

నీటి సరఫరాకు ఆటంకం



చినకాపవరం లాకుల వద్ద నుంచి కొల్లేరులోకి ప్రవహించే ఓల్డ్ వయ్యేరు పంట కాల్వలో మేట వేసిన గుర్రపు డెక్క

ఆకివీడు: మండలంలోని ఓల్డ్ వయ్యేరు పంట కాల్వలో గుర్రపుడెక్క మేటవేయడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బంది కరంగా ఉందని ఆయుకట్టు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంకయ్య వయ్యేరు పంట కాల్వ నుండి ఒక పాయగా కొల్లేరులోకి చొచ్చుకుపోయే ఓల్డ్ వయ్యేరు కాలువ కింద అప్పారావుపేట, కోళ్లపర్రు, రాజులపేట, సిద్ధాపురం, కాళింగగూడెం, చినమిల్లిపాడు, ధర్మాపుర అగ్రహారం, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లోని పంట పొలాలకు సాగు నీటిని, ఆయా గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తుంది. పంట కాల్వలో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రధాన కాల్వ నుండి మీడియం, మైనర్ పంట కాల్వలకు నీటి సరఫరా అంతంత మాత్రమే వెళ్తుందని తెలిపారు. శివారు ప్రాంతాలకు నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, రానున్న రోజుల్లో నీటి సమస్య పెరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పంట కాల్వలో గుర్రపు డెక్క మేట వేయడంతో పూడికలు పేరుకుపోయి నీటి ప్రవాహం మందగిస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ నిధులు రూ. 6.97 లక్షలు మంజూరైనప్పటికీ పనులు మొదలు పెట్టకుపోవడంతో గుర్రపుడెక్క మరింత పెరిగిపోతుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోతే ఉపాధి హామీలో గుర్రపుడెక్క తొలగింపుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై జలవనరుల శాఖ జేఈ జి.రామును వివరణ కోరగా గుర్రపుడెక్క తొలగింపుకు త్వరిత గతిని పనులు మొదలు పెట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు తెలియజేయగా బంధువులెవరో మృతి చెందడం వల్ల పనులు చేపట్టేందుకు ఆలస్యమైందని సోమవారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాని చెప్పినట్లు తెలిపారు.

నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వ సహకారం అభినందనీయం



సంగీత విద్వాన్ పిప్పళ్ల ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమానికి ప్రభుత్వం తమ వంతు సహకారం అందించాలని పశ్చిమగోదావరి జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ బంగార్రావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. భీమవరం ప్రాంతీయ సంఘం సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బంగార్రావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల అనేక సమస్యల పరిష్కారానికి పలు జీవోలు ప్రకటించడం అభినందనీయమన్నారు. చేతి వృత్తులకు చెందిన ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ సంగీత కళాకారుడు పిప్పళ్ళ ప్రసాదును ఘనంగా సత్కరించారు. అనంతరం భీమవరం ఏరియా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం శ్రీమన్నారాయణ, కె.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా జి.రమేష్, ఎం.భోగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా పి.వెంకటేశ్వరరావు, ఎ.పెద్దిరాజు, పెదపాటి రామకృష్ణ, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అరటి కట్ల వెంకటేశ్వరరావు, పీవీవీ సత్యనారాయణ, ఎం.రఘుబాబు, ఎస్.దుర్గారావు, టి.వెంకటేశ్వరరావు, పి.వీర వెంకట సత్యనారాయణ, సీహెచ్ లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో అడ్మిషన్ల గడువు పెంపు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల గడువు జులై 5వ తేది వరకూ పొడిగిస్తున్నట్లు ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. 2023–24 సంవత్సరం నుండి డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం మొదలవుతుందన్నారు. ఈ నూతన విద్యా సంవత్సరం నుంచి బీకామ్ నుంచి (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ నుంచి (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్), బీఎస్సీ నుంచి (మ్యాథ్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ) 9 సింగిల్ మేజర్ సబ్జెక్టు కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 18న విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. జూన్ 19 నుండి జూలై 5 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం కాలేజీలో ఉచిత సౌకర్యం కల్పించామన్నారు. కళాశాల ఎంపికకు జూలై 7 నుంచి 12 వరకూ వెబ్ ఐచ్ఛికాలను కాలేజీలో ఉచితముగా నమోదు చేసుకోవచ్చన్నారు. జూలై 16 న సీట్ల కేటాయింపు 17 నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలు కోసం 91438 39999, 91217 02721, 80748 78227, 99631 80348కు ఫోన్ చేయాలని కోరారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం



గుబ్బలవారిగూడెంలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది

యలమంచిలి: చిన్న చిన్న కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి జగనన్న సురక్ష పథకంలో వారందరికీ న్యాయం చేయాలని సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి కోరారు. శిరగాలపల్లి గ్రామ సచివాలయం వద్ద ఆదివారం జగనన్న సురక్ష పథకంపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్ దేశాలకు వెళ్లడం వల్ల రేషన్ కార్డులో పేరు లేకపోవడం, ఆధార్‌లో సమస్యల వలన పింఛన్ అందకపోయినా, పొలాలకు సంబంధించి మ్యూటేషన్ ఇలా అన్ని సమస్యలకు సురక్ష సర్వేలో పరిష్కారం పొందవచ్చునన్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా ఆదాయ, కుల, ఆధార్‌లో తప్పుల సవరణ ఇలా అన్ని రకాల ధ్రువ పత్రాలు ఉచితంగా ఇస్తారన్నారు. కనుక సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఈ పథకంలోని అంశాలను వివరించి ప్రభుత్వ గ్రాఫ్ పెంచాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు పైడి వెంకటేశ్వరరావు, వీరవల్లి నరసింహమూర్తి, సజ్జా శ్రీనివాస్ సచివాలయ కన్వీనర్ దొంగ నాగలక్ష్మి, గ్రామ కార్యదర్శి పీతల రాజశేఖర్, వీఆర్వో జడ్డు వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్షపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటువారి సమస్యల పరిష్కారంకు తీసుకోవాల్సిన చర్యలపై పెనుగొండ మండలంలో తహసీల్దారు ఎస్.గురుమూర్తి రెడ్డి, ఎంపీడీఓ జి.శ్రీనివాస్ దొరలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులలతో కలసి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష ఉపయోగ పడుతుందని ప్రజలకు వివరిస్తున్నారు.

విద్య, వైద్య సేవలు వెలకట్టలేనివి



నూతన ట్రస్ట్‌బోర్డు సభ్యులతో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఇతర నాయకులు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: దాతృత్వంలో పట్టణ ఆర్యవైశ్యులు అగ్రస్థానంలో నిలుస్తారని, విద్య, వైద్య రంగాలకు వారు అందించిన సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ప్రశంసించారు. పట్టణంలోని ప్రముఖ వైష్ణవ ఆలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీ అష్టభుజలక్ష్మీనారాయణ స్వామి ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారోత్సవ అభినందన సభ ఆదివారం రాత్రి శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘ భవనంలో అట్టహాసంగా నిర్వహించారు. సభలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ ఆర్యవైశ్యులు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే తర్వాత ఆర్యవైశ్యులకు ముఖ్య పదవి ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పానకాలు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా జవ్వాజి వెంకట పానకాలు, ట్రస్టీలుగా నున్న వెంకట కోటేశ్వరరావు, చల్లా లక్ష్మీనారాయణమూర్తి, సాల శ్రీను, పొట్టిపాటి అన్నారాణి, ఉప్పలపు భారతీలక్ష్మి, కెల్లా భూలక్ష్మి, కర్రి వెంకట శ్రీనివాసాచార్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పానకాలు గజమాలతో సత్కరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, పార్టీ నాయకులు చిట్టూరి ఏడుకొండలు, ముచ్చర్ల శ్రీరామ్, అడబాల వెంకటరమణ,సాలా నరసయ్య, ఛాంబర్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు, మద్దా చంద్రకళ, మామిడి బాబు, కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, ఎంఎస్ వాసు పాల్గొన్నారు.

చినగోపురం అభివృద్ధికి వెంకన్న కృషి అభినందనీయం



వెంకన్నను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని చినగోపురంగా ప్రసిద్ధి చెందిన శ్రీ చతుర్భుజ లక్ష్మీతాయార్లు సమేత శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయ చైర్మన్‌గా రెండు సంవత్సరాలు కాల పరిమితిలో ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గాదె వెంకన్న సేవలు అభినందనీయమని పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు వెంకన్న సేవలను అభినందించారు. ఆదివారం పదవీ విరమణ చేసిన వెంకన్నను అతని మిత్రులు పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు వెంకన్నను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఆలయాన్ని ఇంత అభివృద్ధి చేయగలిగానంటే భక్తుల సహకారం ముఖ్యంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు సహకారమే కారణమన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బంగారు మల్లేష్, కాకుల తాతాజీ, మిద్దే రంగా, రావూరి అప్పారావు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 14 పదవులు ఏకగ్రీవం

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 14 పదవులు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి పూర్తిళ్ల శ్రీనివాస్ చెప్పారు. అధ్యక్ష, కార్యదర్శులు పదవులకు మాత్రం ఈనెల 30వతేదీన పోలింగ్ జరుగుతుందని చెప్పారు. అధ్యక్ష పదవికి చల్లా దానయ్యనాయుడు, తానుకొండ సంతోష కుమారి పోటీ పడుతున్నారని చెప్పారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా అందే మణి, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌జీ కుమార్, కార్యదర్శిగా కొప్పినీడి చిట్టి పద్మజ, కోశాదికారిగా బళ్ల శ్రీహరి, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శిగా సోడదాసి శ్రీధర్, మహిళా ప్రతినిధిగా కుంచే దుర్గాభవానీ, , కార్యవర్గ సభ్యులుగా చదలవాడ జ్ఞానప్రకాష్, దొంగ నర్సింహరాజు, ఓసూరి జ్యోతి, కోపెల్ల నాగశిరీష, చల్లా జ్యోతి, ధనాల చాముండేశ్వరి, పులపర్తి హర్షవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు చెప్పారు.

మంత్రి కారుమూరికి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల వినతి

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఆదివారం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరుతూ కార్మికులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను తెలంగాణ ప్రభుత్వ తరహాలో క్రమబద్ధీకరణ చేయాలని, లేనిపక్షంలో మన్మోహన్‌సింగ్ కమిటీ ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పీఆర్సీ సమావేశంలో తమ సమస్యలను విద్యుత్‌శాఖ మంత్రి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కేఎల్‌ఎన్ రాజు, ఇ.ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్స్, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్‌ల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.